

# సంతృప్తి

రచన : కె. ప్రసాద్

తన భార్య ఆరోగ్యంలో, చెప్పుకో దగ్గ మార్పేదో వచ్చి ఉండాలని భాస్కరం అనుకొన్నాడు. చాలా ఆలోచించిన తరువాతగానీ, అతనిలా అనుకోలేదు. నిజానికి శకుంతల గూడా మునుపటిలా లేదు. ఆమె ముఖం, అదోలా ఉంది. నడకలో ఏదో కొత్తదనం కనిపిస్తూ ఉంది.

'ఏమిటి' అని అడిగాడు భాస్కరం.

శకుంతల ఓ నవ్వు నవ్వి, వెళ్లిపోయింది.

తను మళ్ళీ తండ్రిని కాబోతున్నానని, అతనికి తెలిసినప్పుడు, భాస్కరం పడ్డ ఆశ్చర్యం వర్ణనాతీతం: అతను కొన్ని నిమిషాలపాటు కొయ్యబారి పొయ్యాడు.

'వీల్లేదు, వీల్లేదు. ఇలా జరగడానికి వీల్లేదు' అనుకొన్నాడు భాస్కరం.

సరిగ్గా నాలుగు సంవత్సరాల క్రిందట జరిగిన సంఘటన అతని కళ్ళముందు మెదిలింది. అప్పటికి తన జీతం ఇంత లేదు. వచ్చే జీతం చాలక, అతను నానా యాతనా పడ్డాడు. ఎంత పొదుపుగా వాడినా రోజులు గడవకుండా ఉన్నాయి. ప్రతి క్షణానికీ యమయాతన పడాల్సి వస్తూంది. దానికి తోడు నలుగురు పిల్లలు.

ఈ పిల్లలు లేకుండా ఉంటే, అనుకొన్నాడు భాస్కరం! పిల్లలులేని నాటి జీవితం, ఎంత హాయిగా ఆనందంగా గడిచిపోయిందో, అతని కింకా జ్ఞాపకం ఉంది. అలాంటి సుఖకరమైన జీవితం నుండి, ఈ నరకలోకంలోకి రావడానికి పిల్లలే కారణమనిపించింది. అందుకే అతను సంతాన నిరోధం గురించి ఆలోచించాడు. శకుంతలతో గూడా సంప్రదించాడు.

'మీకేమన్నా పిచ్చా ఏమిటి?...... లేకపోతే ఏమిటీ వెధవ్వేషాలు! డబ్బు చాలడం లేదని, పిల్లల్ని కనడం మానేస్తామటండీ? రేపు డబ్బున్నప్పుడు, పిల్లలు రమ్మంటే వస్తారా?' అన్నదావిడ.

ఈ సమాధానం విన్న తరువాత, భార్యతో సంప్రదించడం నిరర్థకమని తేలిపోయింది భాస్కరానికి!

'పిల్లకేం? ఎన్నన్నా చెబుతారు. పెట్టి పోషించవలసిన వాణ్ని నేను. ఆ సాధక బాధకాలన్నీ నాకుంటాయి గానీ, ఇంట్లో ఉండి, ఉడకేసి పెట్టే, ఈ ఆడముండల కేం తెలుస్తాయి!' అనుకొన్నాడు భాస్కరం.

భార్యతో తగాదా ఎందుకనుకొన్నాడు. ఆమె అభిప్రాయంలో, ఏకీభ

వించినట్లే నటించాడు. ఆ విడగూడా — తన భర్త, మనస్సు మార్చుకొన్నాడనే అనుకొంది. భాస్కరానికి కావలసింది గూడా, ఆవిడలా అనుకోవడమే!

భాస్కరం — తెలిసిన డాక్టరు దగ్గర కెళ్లి, తన అవస్థను చెప్పుకొన్నాడు. డాక్టరు శాంతంగా విన్నాడు. ఒకటికి నాలుగుసార్లు ఆలోచించుకో మన్నాడు. తరువాత, మళ్ళీ కావాలంటే, తను చేయగలిగిం దేమీ లేదన్నాడు. అన్నిటికీ భాస్కరం అంగీక రించాడు. ఆపరేషను చేయించు కొన్నాడు. నెత్తిమీదినించి బరువు దించినట్లయింది భాస్కరానికి. ఇక పిల్లలు కలగరు గదా అని సంతృప్తి పడ్డాడు.

కానీ, ఆ సంతృప్తి ఇలా విచ్ఛిన్న మయింది. దీని కేమిటి కారణం? భాస్కరానికి రకరకాల అనుమానాలు కలిగాయి. ఈమధ్య శకుంతల — తరుచుగా పేటికి వెళ్ళిరావడం — ఇప్పుడనేక అనుమానాలకు దారి తీస్తోంది.

ఆమెను నిలవదీసి అడిగాడు. తనే పాపమూ ఎరగనంది. ఇంతకాలం నుండీ లేని, అపర బుద్ధి, ఇప్పుడు తన కెందుకు పుడుతుందీ అన్నది. బావిలో దూకి చచ్చిపోతా నన్నది. కంటికి కడివెడుగా ఏడ్చింది. ఆమె ఏడుపు చూస్తుంటే భాస్కరానికే జాలి వేసింది. శకుంతల తప్పేమీ లేదని, అతని కెవరో చెప్పినట్లయింది. అయితే మరి దీని కేమిటి కారణం?

భాస్కరం ఆదరా బాదరా డాక్టరు దగ్గర కెళ్ళి, జరిగిం దేమిటో చెప్పాడు.

'పిచ్చివాడా! నీ అనుమానానికి ఆస్కారం లేదు. డాక్టర్లయి నంత మాత్రాన, దేవుళ్ళని అనుకోకు. ఒక్కొక్కసారి వారు కూడా పొరబడు తుంటారు. నీ విషయంలో అదే జరిగింది. నీ ఆపరేషన్ జయప్రదం కాలేదని, ఇప్పటిగ్గానీ, తెలిసింది కాదు' అన్నాడు డాక్టరు.

భాస్కరం చాలా తేలిక పడ్డాడు.

కానీ, డాక్టర్, ఈ మాట చెప్పేందుకు, శకుంతల దగ్గిర చాలా పెద్ద ఫీజు పుచ్చుకొన్నా డన్నవిషయం భాస్కరానికి ఈ నాటికీ తెలీదు.

